రైతులు ఉద్యాన పంటలపై దృష్టిసారించాలి

ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్

జోగిపేట, మే 5, ప్రభాతవార్త: రైతులు సాంప్రదాయ పంటల సాగుకే పరిమితం కాకుండా ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం జోగిపేట ఫంక్షన్‌హాలులో రైతువారోత్సవాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటల సాగు ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అనేక రకాల రాయితీలు రైతులకు అందచేస్తున్నట్లు ఆయన వివరించారు. రైతులు ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగు కోసం ఆధునిక పనిముట్లపై సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అందోలు డివిజన్ వ్యవసాయాధికారి రమాదేవి, ఉద్యానవన అధికారి సమత, పుల్కల్ వ్యసాయాధికారి చైతన్య, రైతులు యాదగిరిరెడ్డి, నరసింహారెడ్డి, బాలక్రిష్ణరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

పిఏసిఎస్ చైర్మన్‌గా దుర్గయ్య పునర్నియామకం

మునిపల్లి, మే 5 (ప్రభాతవార్త): మునిపల్లి మండలం పెద్ద చెల్మెడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా పద్మ దుర్గయ్యను ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు ఉత్తర్వులు అందజేశారు. గత సంవత్సరం ఆగస్టులో వీరి పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం వీరి పదవి కాలాన్ని మరో అరు నెలలు పొడగించిది. పొడగించిన పదవి కాలం కంటే ముందే 25 డిసెంబర్ 2025 నాడు చైర్మన్ లను తొలగించడంతో పిఏసి ఎస్ కమిటీలు కోర్ట్ ను ఆశ్రయించారు. తొలగించిన పి ఏసిఎస్ చైర్మన్‌లను వెంటనే నియమించాలని కోర్టు తీర్పు మేరకు వారిని పునర్నియమి స్తున్నట్టు మంగళవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ పద్మ దుర్గయ్య మాట్లాడుతూ తమను ప్రభుత్వం తిరిగి నియమించడం హర్షనీయమన్నారు. గత ఐదు సంవత్సరాలలో పెద్ద చెల్మెడ సోసిటీని సంగారెడ్డి జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలిపానని మరింత అభివృద్ధి చేసి నెంబర్ వన్ స్థాయికి తీసుకు వస్తామన్నారు. రైతులకు రుణాలు ఇప్పించడం, రికవరీ, ధాన్యం కొనుగోలులో సొసైటీని ముందుంచడానికి కృషి చేస్తానన్నారు

వికాస వికలాంగుల పునరావాస కేంద్రంలో చిన్నారుల ఆటలను పరిశీలిస్తున్న సీతాదయాకర్‌రెడ్డి తదితరులు

బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి

నర్సాపూర్, మే 5, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి పేర్కొన్నారు మంగళవారం నర్సాపూర్‌లో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, బి.వచన్ కుమార్‌తో కలిసి ఆము పర్యటించారు. ఈ సందర్బంగా వికలాంగుల పునరావాస కేంద్రాన్ని, భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. బాలబాలికల సంరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఒక చిన్నారికి ఆపరేషన్ ద్వారా అంగవైకల్యం సరిచేయించేందుకు కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కేంద్రాలలోని చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం శివంపేటలోని బేతని సంరక్షణ ఆశ్రమాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మెదక్‌జిల్లాకు మొదటిసారిగా వచ్చిన సీతా దయాకర్‌రెడ్డితో పాటు సభ్యులను అదనపు కలెక్టర్ నాగేష్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హేమభార్గవి, రామాయంపేట సిడిపిఓ స్వరూప, డిసిపిఓ నాగరాజు, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ధాన్యం ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలి : సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్ రూరల్, మే 5, ప్రభాతవార్త : రైతులు ధాన్యాన్ని తేమ శాతం తగ్గేవరకు వ్యవసాయ క్షేత్రాల వద్దే ఆరబెట్టుకుని తర్వాతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. మంగళవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మక్కలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తేమ శాతం సరైన స్థాయికి వచ్చిన తర్వాతే ధాన్యం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో మక్కలు, వరి ధాన్యానికి సరిపడ స్థలం లేకపోవడంతో రైతులు సమీపంలోని గ్రామాల కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యం లిఫ్టింగ్‌కు సిద్ధంగా ఉందని రైతులు తెలియజేయడంతో, వెంటనే సివిల్ సప్లై అధికారులతో మాట్లాడి అవసరమైన లారీలను పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ఏఎంసి చైర్మన్ తిరుపతి రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలి -అదనపు కలెక్టర్ పాండు

శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పాండు

చౌటకూరు, మే 5, ప్రభాతవార్త: జనాభా గణన 2027ను ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 2వ తేదీ నుంచి కొనసాగుతున్న జనగణనపై ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు కొనసాగుతుండగా మంగళవారం శిక్షణ కార్యక్రమాలు ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు హాజరై ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. దేశ అభివృద్ధిలో జనగణన కీలకమని గుర్తు చేశారు. శిక్షణలో పొందిన విషయాలను క్షేత్రస్థాయిలో తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా డేటా నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, నాయబ్ తహసల్దార్ సూరేపల్లి అనుదీప్, ఆర్ఐ ప్రమోద్‌కుమార్, జిలనఆల శిక్షకులు శ్రీకాంత్, ఫీల్డ్ ట్రైనర్లు గోపికృష్ణ, బోగ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే చర్యలు : ఎస్ఐ

నర్సాపూర్, మే 5, ప్రభాతవార్త : రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడుతూ రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఎండబెట్టడంతో అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్లపై ధాన్యాన్ని ఎండబెట్టడంతో వాహనాలు జారిపోయే ప్రమాదం ఉందని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే రహదారి వినియోగదారుల నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపారు. ధాన్యాన్ని రోడ్లపై వేయడంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు ఎవరైనా రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ధాన్యాన్ని నూర్పిల్లు చేయాలంటే మీ వ్యవసాయ భూముల్లో గాని గ్రామపంచాయతీలు కేటాయించిన స్థలంలో గానీ పంటలను ఆరబెట్టుకొని నూర్పిళ్ళు చేసుకోవాలని అయినా సూచించారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీ

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, మే 5, ప్రభాతవార్త: అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్ పోస్టులు, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు అన్నివిధాల చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాలులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్లు, స్కూటీల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందరక్బంగా మాట్లాడుతూ కనీసం యాభై శాతం అంగన్‌వాడా భవనాలకైనా స్వంత భవనాలు నిర్మాణం చేసేలా ప్రయత్నం చేద్దామని మంత్రి పేర్కన్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలంటే చిన్నారుల భావి భవిష్యత్‌కు పునాదిలాంటివని ఆయన పేర్కొన్నారు. అందుకని అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మంచి పోషకాహారం అందించటంతోపాటు చదువుపై శ్రద్ద కలిగే విధంగా పిల్లలకు ఆకట్టుకోవాలని అన్నారు. గర్భిణీలకు, పుట్టినబిడ్డలకు సరైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ప్రధానంగా తాను నమ్మేది బాలికా విద్య, పేదరిక నిర్మూలన అని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాక్షించారు. ముఖ్యంగా ఒక అమ్మాయి చదువుకుంటే ఒక కుటుంబమే బాగుపడుతుందని, తద్వారా సమాజం బాగుపడుతుందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలని, ఎట్టిపరిస్థితుల్లో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని ఆయన హెచ్చరించారు. అలాంటివారిపై చర్యలు తప్పవని ఆయన ఘాటుగా స్పందించారు. అనంతం జోగిపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు 286 మందికి స్మార్ట్‌ఫోన్లను అందచేశారు. మిగతావారికీ ఈ ఫోన్లను అందచేయటం జరగుతుందని ఆయన తెలిపారు. అలాగే పది మందికి స్కూటీలను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, డిడబ్లువో లలితకుమారి, డిఎంహెచ్‌వో వసంతకుమార్, జిల్లా గ్రాంథాయల సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఏఎంసి చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, సంగుపేట సర్పంచు రాంచంద్రారెడ్డి, కౌన్సిలర్లు కొశికె రాజశేఖర్, తోట్ల రామక్రిష్ణ, తహసీల్దారు మధుకర్‌రెడ్డి, సిడిపిఓ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

గొంగ్లూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ధాన్యం తీసుకొచ్చిన రైతులకు

టోకెన్‌లు జారీ చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

పుల్‌కల్, మే 5, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. మండల పరిధిలోని గొంగ్లూర్, ఇసోజిపేట, కోదూర్ గ్రామా ల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. వరి కోతలు ఊపందుకుంటున్నాయని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు వెంటనే టోకెన్‌లు జారీ చేయాలని ఆదేశించారు. రైతులకు గన్నీ బ్యాగులు, దుమ్ము యంత్రాలు, టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వేసవిలో వర్షాలు కురుస్తున్నాయని, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం నిర్ధారణ అయ్యాకే ధాన్యం కొనాలని చెప్పారు. తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం తరలింపుకు లారీ కొరత లేకుండా తహసీల్దార్లు, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రైతులు పండించిన చివరి గింజను కొనుగోలు చేయాలన్నారు.

సర్వీసు రోడ్డులో ధాన్యం ఆరబెట్టవద్దు

అదనపు కలెక్టర్ పాండు

మండల కేంద్రమైన చౌటకూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పాండు పరిశీలించారు. 161వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టవద్దని రైతులకు సూచిం చారు. రహదారులపై ధాన్యం ఆరబడితే వరి కుప్ప లతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉం టాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకోకుండా రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని తహసీల్దార్ నామాల కిష్టయ్యకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ నామాల కిష్టయ్య, నాయబ్ తహసీల్దార్ అనుదీప్, సతీష్‌కుమార్, ఆర్ఐలు నరరేష్, దావుద్, ప్రమోద్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ పాల్గొన్నారు.

రైతు ముంగిట్‌లో శాస్త్రవేత్తలు

వెల్దుర్తి, మే 5, ప్రభాతవార్త : మండలంలోని హస్తల్పూర్ గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు మహదేవప్ప. పుష్పవల్లి పాల్గొని రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. వర్షాకాల పంటల సాగుపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమైన ప్రత్యామ్నాయ పంటలను ఉంచుకోవాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి. ఏవో ఝాన్సీ. ఏవో సాయి కిరణ్ రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్

పోలీసులు బయట వ్యక్తులు కాదు.. మనవారే

సిపి రష్మీపెరుమాళ్

కోహెడ, మే 5, ప్రభాతవార్త: పోలీసులు అంటే బయట వ్యక్తులు కాదని, ప్రజల కోసం పనిచేసేవారేనన్న భావన ప్రతి ఒక్కరిలో కలగాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ అన్నారు. మంగళవారం 'మన పోలీస్ మన ఊరు' కార్యక్రమంలో భాగంగా ఆమె కోహెడ గ్రామాన్ని సందర్శించారు. సీపీకి కోలాటాలతో, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల యువత డ్రగ్స్, మద్యం వంటి సామాజిక సమస్యలపై పోలీసులకు వినతులు వస్తున్నాయని, గ్రామస్తుల సహకారంతోనే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కేసులు నమోదు చేయడమే కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒగ్గు కథలు, పాటల ద్వారా ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడం వల్ల మంచి మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను సీపీ ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటి, హెల్మెట్లు పంపిణీ చేశారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. కార్యక్రమం చివరగా యువతకు వాలీబాల్ కిట్లను అందజేసి, వారితో కలిసి వాలీబాల్ మ్యాచ్‌ను ప్రారంభించడం విశేషంగా నిలిచింది.

సిద్దిపేటలో టిఆర్ఎస్‌కు

బలమైన పునాది వేస్తాం : కల్వకుంట కవిత

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

సిద్దిపేట నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలంగా నిలబెట్టే దిశగా చర్యలు చేపడతామని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట కవిత తెలిపారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గంలోని మోతే రామాలయం దర్శనానికి వెళ్తూ సిద్దిపేటలో ఆగిన ఆమె, పాతబస్టాండ్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని సిద్దిపేటలో తెలంగాణ రక్షణసేన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను విస్తరించనున్నట్లు వెల్లడించారు.

సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కవిత

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సివిల్ సప్లై, డిఆర్డిఓ, పీఏసీఎస్, మిల్లర్ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, మార్కెటింగ్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రంలో తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంటర్ వారీగా లారీలు సమృద్ధిగా ఉండేలా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు చూడాలని ఆదేశించారు. రైతులు ఇచ్చిన ధాన్యం వివరాలను ప్రతి రోజు ట్యాబ్‌లో నమోదు చేయాలని, గరిష్టంగా మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. లారీలలో తరలించే ధాన్యాన్ని టార్పాలిన్‌తో కప్పి మిల్లులకు పంపించాలని సూచించారు. సెంటర్లలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేయడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మిల్లుల్లో దిగుమతికి అవసరమైన హమాలీలను సిద్ధంగా ఉంచాలని మిల్లర్ యజమానులకు సూచించారు. అకాల వర్షాల వల్ల నష్టం జరగకుండా రాత్రి వేళల్లో ధాన్యంపై టార్పాలిన్ కప్పుకోవాలని రైతులకు సూచించారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై గోపికృష్ణ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిఎం మార్కెటింగ్ నాగరాజు, డిఏఓ స్వరూప రాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్

ఉద్యాన పంటలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్

నర్సాపూర్, మే 5, ప్రభాతవార్త : ఉద్యాన పంటలతోనే రైతులు ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం రైతు వారోత్సవాలను రెండవ రోజు యాదవ్ ఫంక్షన్ భవనంలో ఉద్యాన పంటల సాగు ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంటల సాగు అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ తిరుమల సుహాసినిరెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్, ఆర్డీవో రామకృష్ణ, వ్యవసాయ ఉపసంచాలకులు అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో నర్సాపూర్, కౌడిపల్లి, శివంపేట, కొల్చారం మండలాల నుంచి 350 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నీటి సాగు నమూనాలు ఆయిల్‌ఫామ్ నారు మొక్కలు పథకాల కరపత్రాలను రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు, నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడిఏ సంధ్యారాణి, ఏవో దీపిక, ఏఈఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పొద్దుతిరుగుడు, ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ

కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

రైతులు పండించిన పొద్దు తిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ రైతు వారోత్సవాలు జరపడం విడ్డూరంగా ఉందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిన్నకోడూరులోని పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అనంతరం కలెక్ట రేట్ ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ మొద్దు నిద్ర నుండి బయటకు వచ్చి రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. పొద్దుతిరుగుడు ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి రైతులకు మద్దతు ధరను చెల్లించాలన్నారు. 25 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి పొద్దుతిరుగుడు ధాన్యాన్ని తీసుకు వచ్చిన కొనుగోలు చేసే నాథుడు లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో ఏనాడు రైతులకు ఇబ్బందులు రాకుండా రైతు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించిందన్నారు. పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు కాముని ఉమేష్‌చంద్ర, తిరుపతిరెడ్డి, కొత్త శంకర్, రెడ్డి మహేందర్ రెడ్డి, సుంచు ఎల్లం, గాజుల బాబు, గాజుల అనిల్, సంపంగి ప్రతాప్, పోశయ్య, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, ఉస్కే చంద్రారెడ్డి, కొత్త రాజేశం, బొస్సే చంద్రయ్య, ఉస్కే కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తికోసం తండ్రిని ఇంటి నుంచి గెంటేసిన కుమారులు

అక్కన్నపేట, మే 6, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం దుబ్బతండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజ తండాలో వృద్ధుడిపై కుటుంబ సభ్యులే అన్యాయం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గుగులోత్ లాల్‌సింగ్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెల పెళ్లిళ్లు చేసిన అనంతరం ఆస్తిని లాల్‌సింగ్ ముగ్గురు కుమారులకు సమానంగా పంచారని, అయితే తన పేరుపై ఉంచుకున్న ఎకరం భూమిలో 25 గుంటలను కుమారులు తనకు తెలియకుండా తమ పేరుపై చేసుకున్నారని, చివరగా మిగిలిన 15 గుంటల భూమిని తమ పేరుపై పట్టా చేయాలని కుమారులు ఒత్తిడి తెస్తున్నారని, భూమి ఇవ్వనని చెప్పడంతో పట్టా చేస్తేనే అన్నం పెడతాం అంటూ ఇంటి నుండి గెంటేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. భార్య ఉన్నప్పుడు తనపై ఉన్న నాలుగు తులాల బంగారాన్ని కుమారులే పంచుకున్నారని, ప్రస్తుతం వృద్ధుడు చిన్న కుమార్తె వద్ద ఆశ్రయం పొందుతున్నాడు. ఈ ఘటనపై అధికారులు స్పందించి వృద్ధుడికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నకూతురి ఇంట్లో ఉంటున్న లాల్ సింగ్‌కు భోజనం పెడుతున్న కూతురు

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలు

చౌటకూరు, మే 5, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు తీవ్ర గాయాలైన సంఘటన చౌటకూరు సమీపంలోని 161వ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. జోగిపేట నుంచి ద్విచక్ర వాహనంపై సంగారెడ్డికి సిర్గాపూర్ మండలం వంగ్దల్ గ్రామానికి చెందిన భార్యభర్తలు బస్వరాజ్(55), చంద్రకళ(45) వెళుతుండగా మోటారుసైకిల్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

నేటి నుండి రాష్ట్ర సంగీత నాటక అకాడమీ యువనాటకోత్సవాలు

: అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల

రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో నేటి నుండి 3రోజులు యువ నాటకోత్స వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డా. అలేఖ్య పుంజాల మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజూ రాత్రి 6.30గంటల నుండి నాటక ప్రదర్శనలుంటాయని ఆమె పేర్కొన్నారు. మొదటి రోజు నాటకోత్స వాలను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక పర్యాట కశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రెండవరోజు రాష్ట్ర మత్స్య పరిశ్రమ, క్రీడలశాఖల మంత్రి వాకిటి శ్రీహరి, 3వ ఆఖరిరోజు పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా పా ల్గొంటారని చెప్పారు. మొదటిరోజు 6న డింభకరాజ్యం వీధి నాటకం, గేమ్ సాంఘిక నాటిక, శ్రీమహిషాసురమర్థిని పద్యనాట కం; 7న నిశాహినిశి వీధినాటకం, స్వప్నంరాల్చిన అమృతం నాటిక, స్వామియే శరణం అయ్యప్ప పద్యనాటకం; చివరిరోజు 8న మాయాజాలం డాట్‌కామ్ వీధినాటకం, అమ్మచెక్కిన బొమ్మ నాటిక, యయాతి పద్యనాటక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడిం చారు. యువతను ప్రోత్స హించడం కోసం నిర్వహిస్తున్న యువనా టకోత్స వాలకు ప్రవేశం ఉచితమని, అధికసంఖ్యలో యువత, నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఉత్స వాలను విజయవంతం చేయాలని అలేఖ్య పుంజాల కోరారు.

నాణ్యత ప్రమాణాలతో నాలా విస్తరణ పనులను పూర్తి చేయండి : పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ

నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మే 5, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ నాల విస్తరణ పనులలో భాగంగా పరికిచెరువు అలుగు నుండి ప్రేమ్ సరోవహర్ అపార్టుమెంట్స్ వరకు రూ. 8 కోట్ల 76 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చెవుడుతున్న నాల విస్తరణ పనులను ఎస్ఎన్ డిపి ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ మంగళవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ నాలల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు శాశ్వ త పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ధరణి నగర్ కాలనీలో నాల విస్తరణ పనులలో భాగంగా అసంపూర్తిగా మిగిలి పోయిన నాల విస్తరణ పనులను రూ. 8 కోట్ల 76 లక్షల రూపా యల అంచనావ్యయంతో నిర్మాణము పనులు చేపట్టడం జరుగు తుందని తెలిపారు. నాల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని సూచించారు. ఏ చిన్న సమ స్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని చైర్మన్ గాంధీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డిపి ఇంజ నీరింగ్ విభాగం డిఈ ధీరజ్, ఏయి అరుణ్ స్థానిక నాయకులు దొడ్ల రామ కృష్ణ గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, రాజేష్, సంతోష్, శ్రీధర్, ఉమేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సందేహాలను వెంటనే నివృత్తి చేయాలి : కోట నీలిమ

అధికారులతో మాట్లాడుతున్న నీలిమ

సంజీవరెడ్డి నగర్, మే 5, ప్రభాతవార్త:

ఓటరు జాబితా సవరణ కోసం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయా లని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా. కోట నీలిమ సిబ్బందిని కోరారు. మంగళవారం బీకే గూడలోని జీహెచ్ఎంసీ సహాయ కేంద్రం వద్ద నిర్వహించిన ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని అమలును పరిశీలించిన ఆమె, డీసీ సుజాతతో పాటు ఇతర సిబ్బందితో మాట్లాడారు. ఎస్ ఐఆర్ కార్యక్రమంపై ప్రజల స్పందన ఎలా ఉందో తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అర్హులందరి పేర్లను ఓటరు జాబితా లో చేర్చాలని అధికారులకు సూచించారు. ఓటర్ల సందేహాల నివృత్తి విషయంలో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని, జాబితాలో ఖచ్చిత త్వం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఓటర్లు తమ వివ రాలను ఓటరు జాబితాలో తప్పనిసరిగా సరిచూసుకుని, ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సవరించుకోవాలని సూచించారు. అలాగే జాబితాలో పేరు లేని వారు సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన వారి పేర్లు గల్లంతు కాకుండా చర్యలు తీసుకోవాలని, సవరణ ప్రక్రియలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు చెందిన కత్తి ఐధికాకు బ్యాంకాక్‌లో రజత పతకం

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త:

రజత పతకాన్ని సాధించి భారతదేశ జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న కత్తి ఐధిక

ఇటీవల బ్యాంకాక్‌లో జ రిగిన 'బ్యాంకాక్ ఓపెన్ ఫెన్సింగ్ ఛాం పియన్‌షి ప్-2026' లో పోటీల్లో తెలంగా ణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరానికి చెందిన చిన్నారి కత్తి ఐధికా (9) రజత పత కాన్ని సాధించి సత్తా చాటింది. నగరంలోని డెక్కన్ ఫెన్సింగ్ అకా డమీలో కోచ్ సంజీవ్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన చిన్నారి అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ అద్భుత ప్రదర్శనతో ఈ ఘనత సాధించింది. ఐధికా సాధించిన ఈ విజయం భారత ఫెన్సింగ్‌లో పెరుగుతున్న ప్రతిభకు నిదర్శనగా నిలిచింది. కత్తి ఐధిక అంకితాభావం, క్రమశిక్షణ నిరంతర సాధన ఫలితంగా ఈ విజయాన్ని అందుకుందని క్రీడా వర్గాలు అభినం దించాయి. ఈ రజత పతకం ద్వారా ప్రపంచ ఫెన్సింగ్ పోటీల్లో భారత ఉనికిని మరింతగా చిన్నారి బలోపేతం చేసింది. ఇదే టోర్నమెంట్‌లో అర్జున్‌రెడ్డి కూడా అద్భుత ప్రతిభ కనబరిచి అండర్-8 పురుషుల ఫాయిల్ విభాగంలో పతకం సాధించి అకట్టుకున్నారు. ఈ విజ యాలపై డెక్కన్ ఫెన్సింగ్ అకాడమీ హర్షం వ్యక్తం చేసింది.

రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఈవిఎం గోదాన్ని రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి తహసీల్దార్ రాములుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రపరిచిన ఈవిఎంలు, బ్యాలెట్ యాంత్రల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

పేదల దుకాణాలు తొలగించే ముందు ప్రత్యామ్నాయం చూపండి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 5, ప్రభాతవార్త

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

స్థానికుల ఫిర్యాదు మేరకు భరత్ నగర్ కాలనీలో మంగళ వారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు పేరుతో నిరుపేదల జీవనాధారాలను ఏకపక్షంగా తొలగిం చవద్దని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. నిరుపేదల దుకాణాలను తొలగించే ముందు వారికి ప్రత్యామ్నాయంగా మరో చోట వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించి అప్పుడే దుకాణా లు తొలగించాలని అధికారులకు సూచించారు. తెల్లవా రగానే జేసీబీలు పెట్టి రోడ్ల పక్కన ఉన్న చిరు వ్యాపారుల షెడ్లు, తోపుడు బండ్లు కూల్చివేయడం సరికాదని హితవు పలికారు. అనంతరం సియంసి కమీషనర్ సృజన్‌తో ఫోన్‌లో మాట్లాడి అధికారులకు స్పష్టం చేశారు. దుకాణా లు తొలగించే ముందు వ్యాపారులకు తెలియపరచి నోటీ సులు ఇవ్వడము, సరి అయినా గడువు ఇవ్వటం ద్వారా అందులో విలువైన వస్తువులు, పని ముట్లులు తీసుకొని జాగ్రత్త పరుచుకొంటారని తద్వారా కొంత నష్టపోకుండా ఉంటారని అన్నారు. తొలగించిన వారికి ప్రత్యామ్నా యంగా సమీపంలోనే వెండింగ్ జోన్ లేదా మార్కెట్ సమీపములో పునరావాసం కల్పించిన తర్వాతే పాత దుకాణాలను తొలగించాలని రోజువారీ కూలీపై ఆధార పడే కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని కృష్ణారావు తెలిపారు. అభివృద్ధి అవసరమే, కానీ పేదల పొట్ట కొట్టి కాదని గౌరవప్రదమైన అభివృద్ధి జరగాలి అన్నారు. ఆక్ర మణలు తొలగించండి, కానీ ముందు వారికి బతుకుదె రువు చూపించండని కృష్ణారావు సూచించారు. ఈ కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, తూ ము శ్రావణ్ కుమార్, అంబటి శ్రీనివాస్, ఉమావతి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా కుమ్మరి కులస్తులెవ్వరూ లేకపోవడం బాధాకరం : మాజీ డీజిపి పూర్ణచంద్రరావు

కుమ్మరి ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న పూర్ణచంద్రరావు, సూర్యారావు, తిరుమలి, అర్జున్, కీర్తన తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర శాసనసభలో కుమ్మరి కులస్తులు ఎవ్వరూ ఎమ్మెల్యేగా లేకపోవడం, రాజకీయ ప్రాతినిధ్యం దక్కకపోవడం బాధా కరం. వ్యవస్థలోని అసమానతకు నిదర్శనమని ఏబిఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజిపి డా. జె. పూర్ణచంద్రరావు వాపోయారు. మహానేత కాన్షీరాం సిద్ధాంతం ప్రకారం జనాభా శాతాన్ని ఓటుగా, ఓటును శక్తిగా, శక్తిని పాలనగా మార్చుకోవాలని, ఈ స్థితికి చేరుకోవాలంటే కుమ్మరి సమాజం ఐక్యంగా ఒకే వేదికపైకి రావాలని, రాజకీయ చైతన్యాన్ని పెంపొందిస్తూ ముందు కురావాలని పిలుపునిచ్చారు. రవీంద్రభారతి ప్రధానమం దిరం వేదికగా సంగెం సూర్యారావు సభాధ్యక్షతన జరిగిన తెలంగాణ కుమ్మరి సర్పంచుల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన 94 మంది కుమ్మరి సర్పంచులు, 150మంది ఉపసర్పంచు లు, 1500మంది వార్డు సభ్యులను ఘనంగా సత్కరించి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనందుకు శుభాభినందనలు తెలిపారు. ఇది కుమ్మరుల భవిష్యత్తు రాజకీయ శక్తికి బలమైన పునాదిగా భావించాలని చెబుతూ ఎన్నికైన ప్రతినిధులను సన్మానించేందుకు కృషిచేసిన సంగెం సూ ర్యారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ గ్రామస్థా యి నాయకత్వం ముమ్ముందు ఎమ్మెల్యేలు, ఎంపిలుగా ఎదిగేందుకు దోహదపడుతుందని, చట్టసభల్లో ప్రశ్నిస్తేనే వారి సామాజికస్థితి మారుతుందని ఆయన స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుమలి, కె.అర్జున్, విజయకుమార్, నరసింహారావు, దశరథ్, కీర్తన, పార్థసారధి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి సినిమాలు వాణిజ్యంతో కూడిన కళా ఖండాలు : విసి ఆచార్య నిత్యానంద రావు

ప్రముఖ నటుడు అలీ కి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును ప్రధానం చేస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, డాక్టర్ వోలేటి పార్వతీశం, వంశీ రామరాజు, సినీ నటుడు శివ రెడ్డి తదితరులు

చిక్కడపల్లి మే 5, ప్రభాతవార్త : కళాత్మకత ను సమ పాళ్లలో మేళవించి వాణిజ్య పరం గా హిట్ సినిమాలను తీయటం లో దాసరి నారాయణ రావు నేర్పరి అని తెలు గు విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య నిత్యానంద రావు అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ నిర్వహ ణలో డైరెక్టర్స్ డే సందర్భం గా విఖ్యాత దర్శకుడు దాసరి నారాయణరావు 80 వ జయంతి సందర్భంగా వివిధ రంగాలకు చెందిన 36 మంది ప్రతిభావంతులు తో పాటు ప్రముఖ నటుడు అలీ కి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డ్ ప్రదానం సభ నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. వందే భారత్ సినిమా దర్శక నిర్మాత మల్లం రమేష్, నటుడు శివా రెడ్డి జర్నలిస్ట్ లు రెంటాల జయదేవ్ పులగం చిన్నా రావు విదేశీ ఆంధ్రులు పేరీ వెంకట రమణ ఈ రాంకీ బాలా దిత్య టి రామ లక్ష్మి పి ఎస్ ఎన్ మూర్తి తదితరులు తో పాటు దాసరి నారాయణరావు దంపతుల పేరిట ఆదర్శ దంపతులకు సాహిత్య సంగీత విద్యా రంగ ప్రముఖులకు సత్కారం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య నిత్యానంద రావు చేసి మాట్లాడారు దాసరి ఇతివృత్త స్వీకరణ పాటల ఎంపిక లో నాణ్యత ప్రాముఖ్యత చూపే వారని తెలిపా రు వంశీ రామరాజు తన శ్రీమతి సుధా దేవి మంచి రచయిత్రి అని ఆమె స్మారకంగా తెలుగు విశ్వవిద్యా లయం లో కీర్తి పురస్కారం ఏర్పాటు చేయాలి అని సూచన చేశారు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ దాసరి నారాయణరావు నటుడు గా దర్శకుడు గా నిర్మాత గా కదా రచయితగా సినీ రంగంలో పేరు ప్రఖ్యాతులు పొం దినా ఆయన కుటుంబ పర సినిమాలకె ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు వంశీ రామరాజు స్వాగతం పలుకుతూ దాసరి తో తనకున్న అనుబంధం తెలిపారు వేదిక పై మేనేజింగ్ ట్రస్టీ సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ చేయగా సత్యవతి, సుధా మయి వ్యాఖ్యానంలో రామక్రిష్ణ బృందం పాడిన దాసరి నారాయణరావు సినిమాలలోని పాటలు ఆకట్టుకున్నాయి.

ప్రాణాలకు తెగించి రౌడీషీటర్‌ను అడ్డుకున్న ఆటో డ్రైవర్

-సిసి టీవీలో వెలుగుచూసిన సాహసం

-వీరుడిని వెతికి మరీ సన్మానించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్

హైదరాబాద్, మే 5 ప్రభాతవార్త

ఆటో డ్రైవర్ జాహెర్‌ను సన్మానిస్తున్న సీపీ వీసీ సజ్జనార్, చిత్రంలో గోల్కొండ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌వో శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

నేరం జరుగుతుంటే చూస్తూ ఉండిపోవడం కాదు.. ఆ నేరగాడిని పట్టుకోవడమే అసలైన పౌర ధర్మమని నిరూ పించారు ఒక సామాన్య ఆటో డ్రైవర్. ఒక మహిళా బాధితురాలి మెడలోని బంగారు గొలుసును రౌడీ షీటర్ లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తే.. ప్రాణాలకు తెగించి, తన ఆటోనే ఆయుధంగా మలచుకొని సాహసోపేతంగా మహ మ్మద్ జాహెర్ రౌడీ షీటర్‌ను అడ్డుకున్నారు. కత్తితో దాడి చేస్తోన్న బెదరకుండా ప్రతిఘటించారు. ఈ అసామాన్య ధైర్యాన్ని ప్రదర్శించిన ఆటో డ్రైవర్ జాహెర్‌ను హైద రాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మంగళవారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ఆయనకు ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగంబజార్ జిన్సీ చౌరాహా ప్రాం తంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్దకు చేరుకోగానే, డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో నిందితుడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో, అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ ఈ దృశ్యాన్ని సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా గమనించారు. సంఘటన స్థలా న్ని దాటి సుమారు 100 మీటర్ల దూరం ముందుకు వెళ్లి నప్పటికీ, జాహెర్ వెంటనే స్పందించి తన ఆటోను వేగంగా వెనక్కి తిప్పారు. పారిపోవడానికి ప్రయత్నిస్తున్న రౌడీ షీటర్ బైక్‌ను తన ఆటోతో ఢీకొట్టి అతడిని కింద పడేశారు. ఆ సమయంలో నిందితుడు కత్తితో దాడి చేసి నా భయపడకుండా ప్రతిఘటించి అడ్డుకున్నారు. ఆ సమ యంలో పారిపోతుండగా వెంటనే గస్తీ తిరుగుతున్న పోలీసులు రౌడీ షీటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ పని ముగించుకున్న జాహెర్, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆటో డ్రైవర్ సాహసం గురించి గోషామహల్ పోలీసులకు బాధితురా లు తెలియజేశారు. కాగా, ఈ వీరోచిత దృశ్యాలన్నీ అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. రౌడీ షీటర్‌ను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించి, నిస్వా ర్థంగా వెళ్లిపోయిన ఆ అజ్ఞాత వీరుడి కోసం గోషామహల్ పోలీసులు గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో ఆటో నంబర్‌ను సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో జాహెర్‌ను గుర్తించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లా డుతూ.. ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు. "చూస్తుండగానే నేరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో, ప్రాణా లకు తెగించి రౌడీ షీటర్‌ను అడ్డుకున్న జాహెర్ సమా జానికి నిజమైన రోల్ మోడల్. ఆయనలో ఒక అద్భు తమైన ప్రజా పోలీస్ ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలం కూడా ఆశించలేదు. ఇలాంటి బాధ్యతాయుతమైన పౌరు లు ఉన్నప్పుడే నేరస్తులకు భయం పుడుతుంది" అని ప్రశంసించారు. నేరం జరుగుతున్నప్పుడు భయపడకుం డా, మహమ్మద్ జాహెర్ వలె ధైర్యంతో స్పందించి వెంట నే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగరవాసులకు ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. కాగా, డబీర్‌పురకు చెందిన రౌడీషీటర్‌పై గోషా మహల్ పీఎస్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయి. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌వో శ్రవణ్‌కు మార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి రావాలి : బోనాల శ్రీనివాస్ గుప్త

అఫ్జల్‌గంజ్, మే 5 ప్రభాతవార్త:

నియామకపత్రాన్ని అందచేస్తున్న బోనాల శ్రీనివాస్‌గుప్త

రాజకీయాల్లోకి ప్రజలకు సేవ చేసేందుకు యువకు లు, మేధావులు ముందు రావాలని ప్రజా ఏక్తా పా ర్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త పిలుపునిచ్చారు. ఈమేర కు మంగళవారం గౌలి గూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉదాసీన్ ఆశ్రమం పీఠాధిపతి మహంత్ యోగి ప్రశాంత్‌దాస్‌ను ప్రజా ఏక్తా పార్టీ జాతీయ సమన్వయ కర్తగానియ మించి నియాక పత్రాన్ని అందచేశారు. సామాజిక సేవ కార్యక్రమం తోపాటు ఆధ్యాత్మిక నాయకత్వంపై, చురుకైన రాజకీయ భాగస్వా మ్యంలపై సమ్మేళ నాన్ని నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాలకు తమ పార్టీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తెలంగాణ కోఆర్డినేటర్‌గా చంచల్ దేవి సుగంధీ సోని నియమించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

దొంగ ఓట్ల నివారణపై అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, మే 5, ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మలో బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై మంగళవారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులు గా హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. 2002 జనాభా లెక్కల ప్రాతిపదికగా ఓటర్ల వివరాలను సేకరించి, ప్రస్తుత ఓటర్లను ధృవీకరించడంతో పాటు కొత్త ఓటర్లను నమోదు చేయనున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎక్కడా ఉన్న ఓట్లు తొలగించకుండా, అదే సమయంలో దొంగ ఓట్లు చేర్చకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు, అధికారులు సమ న్వయంతో పనిచేస్తూ ప్రతి ఓటరును కాపాడుకోవడం ముఖ్య మని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై త్వరలోనే డివిజన్ వారీగా మరిన్ని సమావేశాలు నిర్వహించి మరింత స్పష్టత ఇవ్వ నున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పట్ల పెరుగుతున్న ఆదరణను దృషి లో ఉంచుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ఇది పార్టీ బలోపేతానికి కీలకంగా మారుతుందని అన్నారు. సభ్యత్వం ద్వారా నాయకుల నిబద్ధత, కార్యకర్తల చురుకుదనం స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఇక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించినట్లుగా రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలోనే క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు అవకాశమివ్వాలనే లక్ష్యంతో కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాప్రతి నిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మతపరమైన ఆంక్షలను తొలగించి ఎస్సీలకు సంపూర్ణ మత స్వేచ్ఛ కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బోడ రాకేష్‌నాయక్

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం వెంటనే మత పరమైన ఆంక్షలను తొలగించి షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కు సంపూర్ణ మత స్వేచ్ఛను కల్పించాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం డిమాండ్ చేసింది. లేని పక్షంలో తాము సుప్రీం కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేస్తామని సంఘం హెచ్చరించింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం జాతీయ చైర్మన్ బోడ రాకేష్‌నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద ఉన్న ఎస్సీ ఆర్డర్ 1950, క్లాజ్ 3లోని మతపరమైన నిబంధనలకు పూర్తిగా చట్టవిరుద్ధమైనవి, ఏకపక్షమైనదని ఆరోపించారు. దళితులు కేవలం మతం మారినంత మాత్రాన ఎస్సీ హోదాను రద్దు చేయడం సమంజసం కాదని, అలా చేయడం వల్ల వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి దళితులు ఏ మతం ఆచరించినా వారు ఎస్సీ హోదా కోల్పోకుండా రాజ్యాంగంలోని 14, 15, 16, 21, 25 ఆర్టికల్స్ ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించాలని కోరారు. దళితులు భారత దేశ పౌరులని, ద్వితీ య శ్రేణి పౌరులు కాదని, బానిసలు కాదని వారు స్పష్టం చేశారు. అందరికి సమాన హక్కులు దక్కెలా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఆర్డర్ 1950 లోని మత పరమైన ఆంక్షలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతి నిధులు జాన్ శ్యామ్యూల్, పి.ఏలియా, ఎండి.షహబుద్దిన్, రమేష్, హీరాలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదివి దేశానికి సేవలందించాలి

విద్యార్థిని సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్.

కార్వాన్, మే5(ప్రభాతవార్త)

గుడిమల్కాపూర్ డివిజన్ శారదానగర్ సర్కిల్ లోగల న్యూజె న్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థి తెలంగాణ రాష్ట్ర రెండ వ స్థానంలో ఉత్తీర్ణతతో ప్రతిభను కనబరిచిన సాత్విక్ అనే ద్యార్థిని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బృందం అభినందించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి గోల్కొండ జిల్లా ఇంచార్జ్ శ్రీధర్జీ, గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్, గోల్కొండ జిల్లా ప్ర.కార్యదర్శి అనంత కృష్ణ, ప్రభు పూజారి, రాజేష్, రాధా కిషన్, సందేశ్ యాదవ్, వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం : జితేందర్‌నాథ్

అల్వాల్, మే 5 ప్రభాతవార్త:

ప్రజా అవసరాలు మేరకు అభివృద్ధి కొనసాగుతుందని మచ్చ బొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొ న్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మా సంతోషి కాలనీ ఫేజ్ 1, లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లలో కొనసాగుతున్న యుజిడి, సిసి రోడ్డు పనులు ఇంజనీరింగ్ అధికారులుతో కలిసి జితేం దర్‌నాథ్ పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. అనంతరం స్థానికంగా పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేంద ర్ రెడ్డి, లడ్డు రెడ్డి, శ్రీశైలం యాదవ్, రమేష్, దిడ్ల స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరగాలి : సిఐ పశాంత్

సమావేశంలో ప్రసంగిస్తున్న సిఐ

అల్వాల్, మే 5 ప్రభాతవార్త: పండుగల వాతావరణం ప్రారం భమవతున్న నేపథ్యంలో అన్ని వర్గాలు ప్రజలు కలిసి మెలసి ఉండాలని అల్వాల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కోరారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో అల్వాల్ సర్కిల్ డిసి భోగేశ్వర్, మత పెద్దలుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్స వాలు సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా కట్టుదిట్టమైన చర్యలు తమ పరంగా ఉంటాయని ప్రజ లు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కద లికలకు సంబంధించి తమకు సమాచారం అందించాలన్నారు. జిహెచ్ఎంసి పరంగా అవసరమైన వసతులను కల్పిస్తామని సర్కిల్ డిసి భోగేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ వీరబాబు, ఎస్ఐలు తరుణ్, రాఘవేంద్ర రెడ్డి, దేవేందర్, మల్లేష్, తులసి రామ్, గీత తదితరులు పాల్గొన్నారు.

మా అన్న ఎమ్మెల్సీ.. నీ అంతు చూస్తా!

జూబ్లీహిల్స్, మే 5, ప్రభాతవార్త:

మా అన్న ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్.. నీ అంతు చూస్తానం టూ ఒక మహిళను బెదిరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ ఠాణా లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకా రం.. దిల్‌సుఖ్‌నగర్ ఇంద్రానగర్‌కు చెందిన కల్వల శోభ(38) ఒక ప్రకటన సంస్థలో పనిచేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎన్ఆర్ డిజిటల్స్‌కు చెందిన విజయ్ రెడ్డి, మరికొందరు ఆమెతో అసభ్యంగా, దూషణాత్మకంగా మాట్లాడుతూ మానసి కంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటీవల అక్రమ ప్రకటన బోర్డులపై ట్విటర్‌లో పోస్టు చేయడంతో పాటు లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకో వాలని వారు ఒత్తిడి తెచ్చారు. ఏప్రిల్ 29న బంజారాహిల్స్ లోని హాజీ అలీ జ్యూస్ పాయింట్ వద్ద తన మేనేజర్ సలీం తో కలిసి ఉన్న సమయంలో రాజ్‌కుమార్ అనే వ్యక్తి ద్వారా విజయ్ రెడ్డి పరిచయం అయ్యాడని, ఈ సందర్భంగా తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం గురించి ప్రశ్నించగా, నీ అం తం చూస్తా అంటూ బెదిరించాడు. తన అన్న ఎమ్మెల్సీ బ ల్మూర్ వెంకట్ మద్దతు తనకు ఉందని బెదిరింపులకు దిగా డు. ఈ మేరకు బంజా రాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 79, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లను విక్రయిస్తూ పట్టుబడ్డ బిటెక్ విద్యార్థి

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: ఛండిగడ్‌లో బిటెక్ చదువు తున్న తెలంగాణ విద్యార్థి తక్కువ ధరలకు మద్యం ఖరీదు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తూ పట్టుబడ్డ సంఘటన వెలుగు లోకి వచ్చింది. సికింద్రాబాద్ ఎక్సైజ్ డిటిఎఫ్ బృందం మాటువేసి అతను మద్యం అమ్మకాలకు యత్నిస్తున్న సమయంలో పట్టుకుంది. మనకాల చరణ్ (22) అనే విద్యార్థి ఛండిగడ్‌లో బిటెక్ చదువుతూ చదువులకు అవసరమైన డబ్బులు లేకపోవడంతో తోటి స్నేహితుల సూచనల మేరకు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారని డిటిఎఫ్ సిఐ సౌజన్య తెలిపారు. అతని వద్ద నుంచి 50 వేల రూపాయల విలువ గల జానీ వాకర్, చివాస్ రీగ్ బ్రాండ్ల బాటిళ్లను బృందం స్వాదీనం చేసుకుంది. నిందితుడిని మద్యం బాటిళ్ళతో సహా నారాయణగూడ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామని ఎఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

ఏటీఎం నగదు దుర్వినియోగం కేసులో నిందితుడు అరెస్ట్

సంజీవరెడ్డి నగర్, మే 5, ప్రభాతవార్త:

ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనంగా మారిన ఏటీఎం నగదు దుర్వినియోగం కేసులో నిందితుడు వాసిరెడ్డి సీతారాంను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏటీఎంలలో డబ్బులు తక్కువగా జమ చేసి సుమారు రూ.1.20 కోట్లు దోచుకు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్ఆర్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివా స్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు పి. నవీన్ బ్రాంచ్ మేనేజర్, (సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్, సికిం ద్రాబాద్ బ్రాంచ్) ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. నిందితుడు వాసిరెడ్డి సీతారాం, ఏటీఎంలలో నగదు నింపే (క్యాష్ కస్టోడియన్) గా పనిచేస్తూ తన బాధ్యతలను దుర్విని యోగం చేసినట్లు పోలీసులు తెలిపారు. నిర్ణీత ఏటీఎంలలో డబ్బు జమ చేయకుండా, ఆ మొత్తాన్ని తన వ్యక్తిగత అవస రాలకు మళ్లిస్తూ సుమారు రూ.1.20 కోట్లు దుర్వినియోగం చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై 11 ఏప్రిల్ 2026న కేసు నమోదు చేయగా, దర్యాప్తు కొనసాగించిన పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరిస్తూ పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడికి జైలు

చాంద్రాయణగుట్ట, మే 5, ప్రభాతవార్త : అనుమానాస్పదం గా తిరుగుతున్న ఒక యువకుడికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి కథ నం ప్రకారం... జీ.ఎం.కాలనీ నివాసి, సెల్స్‌మెన్ మహ్మద్ అయాన్ (18) స్థానికంగా అనుమానాస్పదస్థితిలో సంచరిసు న్నాడు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారిం చగా పొంతలేని సమాధానాలు ఇచ్చాడు. అతనిపై ఈ పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని ఎస్.ఎం.ఎం.కోర్టు ముందు హాజరు పరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి అయా న్‌కు రెండు రోజులు జైలుశిక్ష విధించారు. కేసును ఎస్సై చంద్రారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

నార్వే వర్క్ వీసా ఇప్పిస్తానని ప్రైవేట్ కన్సల్టెన్సీ మోసం

-విచారణకు ఆదేశించిన చిన్నారెడ్డి

బేగంపేట మే 5, ప్రభాతవార్త

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 35మంది పట్టభద్రులకు నార్వేదేశానికి వర్క్ వీసా మీద ఉపాధి కల్పిస్తామంటూ చెప్పి ఐబుక్ అనే ప్రైవేట్ కన్సల్టెన్సీ మోసం చేసిందని బాధితులు మంగళవారం సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. ప్రవాసీ ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి ఫిర్యాదును పరిశీలించి సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డా. చిన్నారెడ్డి దృష్టికి తీసికెళ్ల గా సైబరాబాద్ పోలీసు కమీషనర్ కు ఎండార్స్ మెంట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర విచారణ జరపాలని సూచించారు. ఐబుక్ కన్సల్టెన్సీ ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల రూపా యలు చొప్పున వసూలు చేసారని, నకిలీ వర్క్ పర్మిట్, నకిలీ వీసా అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని, తాము మోసపోయామని గ్రహించిన బాధితులు కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు.

నేత్రపర్వంగా సాగిన శ్రీవారి గజవాహన సేవ

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వా మివారి వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా మంగళవారం శ్రీనివాసుడు గజవాహనసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా క్షేత్రసాంప్రదాయంగా అలయం వ్యవస్థాపక వంశీయులు అలయం వ్యవస్థాపక వంశీ యులు జి.శ్రీనాథ్‌గౌడ్-కీర్తి దంపతులు, సహాయ కమీషనర్ వి.అంబుజ ఆధ్వర్యంలో జపహోమ, పూజ, అర్చనాది సేవలతో ధార్మిక ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఉత్స వాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్స వాల్లో భాగంగా సుప్రభాతసేవ, బిందె తీర్థం, హవనము, బలిహరణము, బాలభోగము, మంత్రపుష్పం, తీర్థప్రసాదాన్ని భక్తులకు అం దించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం పూ ర్తయిన తర్వాత వేదపారాయణము, ద్రావిడ ప్రబంధము భేరి పూజ, మహానివేదన అనంతరం గజవాహనసేవ జరిగింది.



హోమాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న వేదపండితులు

రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే 5, ప్రభాతవార్త : పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని నిరసిస్తూ మంగళవారం మండల పరిధిలోని చెప్యాల చౌరస్తాలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు చేపట్టిన ఆందోళనలకు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించి రైతులతో కలిసి రోడ్డుపై బైటాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ నిర్లక్ష్యం వల్లే ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని సత్వరమే ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా రైతులతో కలిసి తానే కలెక్టరేట్ ఎదుట ఆందోళనచేస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు, బిఆర్ఎస్ నాయకులు తోట అంజిరెడ్డి, తోట కమలాకర్‌రెడ్డి, వల్లాల సత్యనారాయణ, హైమద్, రంగమైన బిక్షపతి, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

రైతులతో మాట్లాడుతున్న అత్తు

సిద్దిపేట అర్బన్, మే 5,ప్రభాతవార్త : బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడూ రైతుల సమస్యలను పట్టించుకోలేదని అధికారం కోల్పోగానే రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) మండిపడ్డారు. సిద్దిపేటలోని మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. మార్కెట్ యార్డులో సరిపడా గన్నీ బ్యాగులు ఉన్నాయని చెప్పారు. మార్కెట్ యార్డులలో ప్రతి గింజను కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లిస్తుందన్నారు. మొక్కజొన్న రైతుల కోసం 15 వేల బ్యాగులు అవసరమని తెలియడంతో వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా మార్కెఫెడ్ ఎండితో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్షద్ హుస్సేన్, సాదిక్,రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీని సత్కరిస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, మే 5, ప్రభాతవార్త : టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదారాబాద్‌లోని స్వగృహంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ మాజీ అధ్యక్షుడు గుంటేటి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం నియోజకవర్గంలో జిల్లాలో పార్టీ పరిస్థితిని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అడిగి తెలుసుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సామలేటీ మహేష్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేత

ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేస్తున్న సులోచన మల్లేశ్‌యాదవ్

గజ్వేల్ టౌన్, మే 5, ప్రభాతవార్త: మండల పరిధిలోని అనంతరావుపల్లి సర్పంచ్ దావనమైన సులోచన మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం టెన్త్‌లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినీలకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున రూ.10 వేల నగదును బాలికలపై చదువులకు చిరు ప్రోత్సాహంగా అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే విద్య సంవత్సరంలో టెన్త్‌లో ఎంత మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తే అంతమందికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండస్వామి, ఉపసర్పంచ్ బైరం రమేష్, వార్డు సభ్యులు దార సతీష్, దాసరి లక్ష్మి, దాసరి లలిత, గ్రామస్తులు దావుగారి కిషన్, దావనమైన నర్సింలు, దాసరి రాజు, కొప్పు రవి, దావనమైన రమేష్, తుమ్మ స్వామి, బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముద్దాయిపేటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

పుల్‌కల్, మే 5, ప్రభాతవార్త: మండల పరిధిలోని ముద్దాయిపేటలోని శివన్నకుంట వద్ద మంగళవారం జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నుంచి ఆగ్రానమీ విభాగాలకు చెందిన డాక్టర్ పి.రేవతి, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ విభాగానికి చెందిన డాక్టర్ కె.రాకేష్ పాల్గొని రైతులకు వ్యవసాయం సాగుపై మర్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడిని పాటించాలన్నారు. సరైన విత్తనాల ఎంపిక, సమయానికి విత్తనం విత్తడ, తగిన అంతరాలు పాటించడం లాంటి అంశాలపై వివరిస్తూ వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సమగ్ర పోషక నిర్వహణ, తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందే విధానాలపై వివరించారు. రైతులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు రేవతి నివృతి పర్చారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ శాస్త్రీయ పద్దతులు పాటిస్తూ వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పథకాల వినియోగం, రైతు సమూహాల ఏర్పాటు లాంటి అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా...?

పందిళ్ల వంతెన వద్ద కొనసాగుతున్న నిర్లక్ష్యం

హుస్నాబాద్ రూరల్, మే 5, ప్రభాతవార్త

హుస్నాబాద్ మండలం పందిళ్ల వంతెనవద్ద ఇటీవల జరిగిన కారు ప్రమాదం ఈ ప్రాంత ప్రజలను కలవరపరిచిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా భద్రతా చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అధికారులు అక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయక పోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రమాదం జరిగిన ప్రదేశం ప్రమాదకరంగా ఉందని, వంతెన వద్ద దారి స్పష్టంగా కనిపించదని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రదేశాలలో నిబంధనల ప్రకారం తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ నియంత్రణ సూచనలు ఉండాల్సి ఉండగా అక్కడ అవేవీ లేకపోవడంతో డ్రైవర్లు అప్రమత్తం కావడానికి అవకాశం లేకుండా పోతోందని ఘటన స్థలాన్నిచూస్తే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇదే బ్రిడ్జి(వంతెన) వద్ద ఇంతకముందు కూడా అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది తీవ్ర గాయాలపాలు కాగా పందిల్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. ఇంకా ఎంత మంది ప్రాణాలు పోయాక చర్యలు తీసుకుంటారని గ్రామస్థులతో పాటు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రమాదం జరిగి గాయాల పాలైన కుటుంబం ఉదంతం తాజాగానే ఉండగా, అదే పరిస్థితి కొనసాగుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. ఇలాంటి కీలక ప్రాంతాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నట్టే అని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పందిళ్ల వంతెన వద్ద తగిన హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాద సూచికలు లేకపోవడంతో అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి నుజ్జునుజ్జయిన కారు దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలి

బిఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

కొండపాక, మే 5, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి చేతకానితనంవల్లే ధాన్యాన్ని కొనడంలో నిర్లక్ష్యం జరుగుతుందని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక మండలం దుద్దెడలో ధాన్యాం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి రాజీవ్ రహదారి దిగ్బంందం చేస్తామని హెచ్చరించారు. రైతులు ఎండలతోపాటు కొనుగోలు కేంద్రాల్లో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్దిలేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతులను చిన్నచూపు చూస్తున్నడని అగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కాలయపనమాని వెంటనే కొనుగోలు ప్రారంభించాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని ఆరబోస్తున్న సమయంలో ఎండ దెబ్బ తగిలి ఇద్దరు రైతుల మృతి చెందినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మిద్దె శివకుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, దర్గా సర్పంచ్ తేలు అశోక్, ఉప సర్పంచ్ కొమ్ము జానకి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు బాలజీ, కొడెల రవి, మిద్దె చంద్రమౌళి, పాల్గొన్నారు.

జనాగ్రహ సభకు భారీగా తరలివెళ్లాలి

బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్

నర్సాపూర్, మే 5, ప్రభాతవార్త : ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగే బిజెపి జనగ్రహ బహిరంగ సభకు మెదక్ జిల్లా నుండి నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లాలని ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నీలి నగేష్ ఆధ్వర్యంలో జనగ్రహ బహిరంగ సభ మండల సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జనాగ్రహ బహిరంగ సభకు కార్యకర్తలను తరలించేందుకు నాయకులు సిద్ధం చేసుకోవాలని జిల్లా వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ సూచించారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బాలరాజు శక్తి కేంద్ర ఇన్చార్జి కుమార్ నగేష్ గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

ముదిరాజ్ మత్స్యశాఖ నూతన కమిటీ ఎన్నిక

గుమ్మడిదల, మే 5, ప్రభాతవార్త:

మంబాపూర్ గ్రామంలో ముదిరాజ్ మత్స్యశాఖ నూతన కమిటీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో ఎన్నుకోబడిన సభ్యులకు జిల్లా ఎన్నికల అధికారి చక్రధర్ ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధ్యక్షుడిగా మద్దూరి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రొయ్యపల్లి ప్రశాంత్, కార్యదర్శిగా యాట రమేష్ బాధ్యతలు చేపట్టారు. అలాగే మత్స్యశాఖ సలహాదారుడిగా మద్దూరి సత్యనారా యణను నియమించారు. డైరెక్టర్లుగా మద్దూరి శ్రీనివాస్, మద్దూరి సాయి రాం, యాట రాము, తలారి పవన్, ఇస్తారి ఆంజనేయులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు ప్రజలు అభినందనలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి, మత్స్య శాఖ సంక్షేమానికి కృషి చేస్తామని ఈసందర్భంగా కొత్త కమిటీ సభ్యులు తెలిపారు.

నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

మున్సిపాలిటీ ఎదుట బిఆర్ఎస్ ఉద్యమకారుడి నిరసన

-కోఆప్షన్ పదవిలో అవకాశం ఇవ్వలేదని ఆవేదన

జిన్నారం, మే 5, ప్రభాతవార్త:

గడ్డపోతారం మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నికలవేళ తనకు అన్యాయం జరిగిందని బిఆర్ఎస్ ఉద్యమకారుడు నారాబోయిన శ్రీనివాస్ నిరసన వ్యక్తంచేశారు. కోఆప్షన్ సభ్యురాలిగా నారాబోయిన సరిత పేరుతో నామినేషన్ వేయించానని, గతంలో పార్టీ పెద్దలు ఇచ్చిన హామీ మేరకు అవకాశం కల్పిస్తారని ఆశించానని తెలిపారు. తీరా ఎన్నికల సమయంలో తమను విస్మరించడంపై మున్సిపాలిటీ కార్యాలయంవద్ద ఆయన ఆవేదనచెందారు. 2001 నుండి పార్టీలో కొనసాగుతున్నానని, ఉద్యమకాలంనుండి కష్టపడి పనిచేస్తున్న తనను గుర్తించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నుండి తనను బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన సమయంలో ఇచ్చిన మాటను ఇప్పుడు విస్మరించారని ఆరోపించారు. గతంలో సర్పంచ్, ఎంపిటిసిగా పని చేసినవారు కూడా ఈ పదవులకోసం ఆశపడటం సరికాదని విమర్శించారు. సమయం వచ్చినప్పుడు తనేంటో చూపిస్తానని నారాబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు

చిన్నశంకరంపేట, మే 5, ప్రభాతవార్త:

శాంతిభద్రతలకు ఆంటకం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని చిన్నశంకరంపేట ఎస్సై శివానందం తెలిపారు. మంగళవారం ఠాణాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని రహదారుల వెంట తూర్పార బెట్టడం సరికాదని, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతులు సహకరించాలని కోరారు.ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని, నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సమయంలో 100కి ఫోన్ చేయాలని సూచించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మే 5, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మండల పరిధిలోని కంజీపూర్ నివాసి నీరుడు నర్సమ్మ సిఎంఆర్ఎఫ్ చెక్కు రూ.310000 లబ్ధిదారులకు నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ప్రభు త్వం అందించే సిఎంఆర్ఎఫ్ చెక్కులు నిరుపేదలకు బాసటగా నిలుస్తు న్నాయని అన్నారు. వారితోపాటు పండరిరెడ్డి, మాజీ ఎంపిటిసి అశోక్ పాటిల్, లక్ష్మణ్, జైరాజ్, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీచేసిన మున్సిపల్ మాజీ చైర్మన్

అమీన్‌పూర్, మే 5, ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, అమీన్‌పూర్ రెవెన్యూ మండలాల పరిధి లోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూ రైన చెక్కులను ఆయన పంపిణీచేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఎమ్మెల్యేతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ముఖ్య నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, మే 5, ప్రభాతవార్త:

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకట్రావ్‌పల్లి సర్పంచ్ మల్లేశం తెలిపారు. మంగళవారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిసి నాగరాజు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మల్లేశం

కృషి,పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధ్యం

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే 5, ప్రభాతవార్త : కృషి, పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధ్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డిలోని రామాలయం కళ్యాణ మండపంలో మంగళవారం ప్రభుత్వ విద్యా పరిరక్షణవేదిక ఆధ్వర్యంలో టెన్త్‌లో 500కుపైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల 90 మంది విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో మెమోంటోలు అందించి శాలువాలతో సత్కరించారు.

అనంతరం ఆయన మాట్లా డుతూ అధునిక కాలానికి అనుగుణంగా టెక్నికల్, నైపుణ్య విద్యపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ ప్రొ. పెద్దిరాజు, డిఈవో శ్రీని వాస్‌రెడ్డి, ఎస్‌టిపి రామస్వామి ఎంఈవో ప్రవీణ్ బాబు, బిఆర్ఎస్ నాయకులు కమలాకర్‌రెడ్డి, సుకూరి లింగం, ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక సభ్యులు బాలరాజు, అందె ప్రవీణ్, రామచంద్రం, కనకరాజు, దశరథం, నరేష్, శ్రీనివాస్, ఐలయ్య, కళాకారులు గణేష్‌స్వామి, దప్పు బాబు, ఢిల్లీ రాజు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులను సత్కారిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

వ్యవసాయమే ప్రజల ప్రధాన ఆదాయం

వ్యవసాయమే ప్రజల ప్రధాన ఆదాయం అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని జయ విజయ ఫంక్షన్ హాల్‌లో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ ఫామ్ పంట సాగు, వివిధ ప్రభుత్వ హార్టికల్చర్ పథకాలపై నిర్వహిం చిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్లన్న సాగర్‌వంటి ప్రాజెక్టుల ద్వారా కాలువలలో నీటి లభ్యత పెరగడంతో భూమిలో తేమశాతం మెరుగు పడిందని దీంతో గతంలో సాధ్యం కానీ అయిల్‌ఫామ్ సాగుకు అనుకూల పరిస్థితులు వచ్చాయన్నారు. రైతులు ఆయిల్‌ఫాం సాగువైపు దృష్టి సారించాలన్నారు. భూసారం పూర్తిగా తగ్గిపోకముందే రైతులు మేల్కొని పంటల వైవిధ్యాన్ని అవలంబించడం ద్వారా భవిష్యత్‌ను భద్రపరుచు కోవాలన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

రాయపోల్, మే 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, మాజీ జడ్పీటిసి లింగాయపల్లి యాదగిరి, నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, గౌడ సంఘం నాయకులు మంతూరి యాదగిరిగౌడ్, మహేష్‌గౌడ్, నాగుల్‌గౌడ్, మన్నె అంజనేయులు, సత్యనారాయణ,దాసరి బాలనరసింహులు, రాజనర్సు, కల్లూరి రాజు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

తొగుట, మే 5,ప్రభాతవార్త ప్రతినిధి: ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండారుపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి విశ్వాసంతో ఎల్లమ్మ తల్లిని మొక్కుకుంటే అమ్మ వారి కృపతో కోరికలు నెరవేరుతాయన్నారు. బండారుపల్లిలో ప్రతిష్టించిన ఎల్లమ్మ తల్లి విగ్రహం, నిర్మించిన ఆలయం అద్భుతంగా ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనం అని కొనియాడారు. మహోత్సవాలు నిర్వహిస్తున్న గౌడ సంఘం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను గౌడ కులస్తులు ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, బిఆర్ఎస్ నాయకులు, గౌడ కులస్తులు, పాల్గొన్నారు.

నూతన వధువుకు పుస్తెలు, మెట్టెల పంపిణీ

సిద్దిపేట అర్బన్, మే 5,ప్రభాతవార్త : సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన పేద వధువు రజిత వివాహా నిమిత్తం మంగళవారం 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం దంపతులు పుస్తెలు, మెట్టెలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆడపిల్లల వివాహానికి ఎల్లవేళల తోడుగా ఉంటూ సహకారం అందిస్తానన్నారు. తెలిపారు. పుస్తెలు, మెట్టెలతో పాటు చీర సారే అందించినట్లు తెలిపారు. మంచి మనస్సుతో చేయూతను అందిస్తున్న కౌన్సిలర్ దంపతులు ధర్మవరం స్వప్ప బ్రహ్మంలకు శేఖర్, ఉదయ్,బాలు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితుడికి ఎల్ఓసి అందజేత

బెజ్జంకి,మే 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర రాజు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు వొరగంటి అనంద్ మంగళవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.25,000 ఎల్ఓసిని అందజేశారు. ఎల్ఓసి మంజూరికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు రాజు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలి : ఎస్ఐ

బెజ్జంకి, మే 5, ప్రభాతవార్త : ప్రజలను సమన్వయపరుస్తూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని ఎస్ఐ తోట తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి వ్యవస్థ అయినా తమ కార్యకలాపాలను సమర్థవంతంగా నడపాలి అంటే ప్రజల సహకారం ఎంతగానో అవసరం అన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. యువత మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. మద్యం సేవించి సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎండాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలు చెరువులు, బావులు, కాలువల వద్ద ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో దయల్ 100ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

హుస్నాబాద్ రూరల్, మే 5, ప్రభాతవార్త : రైతును ఆర్థికంగా బలోపేతం చేసే పంటలలో ఆయిల్‌ఫామ్ కీలకమని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం శుభం గార్డెన్‌లో ఆయిల్ ఫామ్ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆయిల్ ఫామ్ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్నపై మాత్రమే ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా అధిక లాభాలిచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ఐలయ్య మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు పొందడమే కాకుండా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు సబ్సిడీ అందిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జగదాంబ అమ్మవారికి పంచామృతాభిషేకం

కౌడిపల్లి, మే 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని బతుకమ్మ తండాలో సేవాలాల్ జగదాంబ భవాని తృతీయ వార్షిక మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పర్తియానాయక్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల వేదమంత్రాలతో కలశ స్థాపన నవగ్రహ పూజ చండి హోమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం జగదాంబ భవాని అమ్మవారిని పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు దేవేందర్‌కుమార్, మక్బూల్ రమేష్ నాయక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కౌడా శ్రీనివాస్‌గుప్తా కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్‌గౌడ్ కురుమ సంఘం మండల అధ్యక్షులు ముంబై లక్ష్మణ్‌యాదవ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు

గుమ్మడిదల, మే 5, ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధిలోని ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా ముందస్తుగా ప్రత్యేకచర్యలు చేపడుతున్నామని గుమ్మడిదల మున్సిపల్‌చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్‌పరిధిలోని 9వ, 20వ వార్డులలో ఆయా వార్డుకౌన్సిలర్లు మద్ది సోనీరెడ్డి, గిద్దె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన బోరుబావి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు పద్మ, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, మురళి, జైపాల్‌రెడ్డి, కుమార్ గౌడ్, చక్రపాణి, సంజీవరెడ్డి, రమేష్, కిషన్, కోఆప్షన్ సభ్యులు భాస్కర్ రెడ్డి, నాయకులు నాగేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, రాజు, హుస్సేన్, మహేష్, నాయకులు, ఆయా వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బోరు బావులను ప్రారంభిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాలకు పులిమామిడి రాజుకు ఆహ్వానం

ఆహ్వానం పలుకుతున్న నిర్వాహకులు

సదాశివపేట, మే 5, ప్రభాతవార్త:
పట్టణ సమీపంలోని వెంకటాపూర్ గ్రామంలో స్వయంభూ శ్రీపద్మావతి సమేత అద్భుత వేంకటేశ్వరస్వామి చతుర్థవార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజును ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమాలు మే 5 మంగళవారం నుంచి మే 8 శుక్రవారం వరకు జరుగనున్నాయి. మే 7 గురువారం ఉదయం 11 గంటలకు శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహించబడుతుంది. అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి దివ్య విమాన రథోత్సవం సదాశివపేట పట్టణం నుంచి వెంకటాపూర్ ఆలయం వరకు వైభవంగా జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ అధ్యక్షుడు చిల్వేరి వెంకటేశం కోరారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పండల జగదీశ్వర్ పంతులు, షోలాపురం రాజు, తాటికొండ నాగనాథ్, సుధాకర్, మల్రెడ్డి, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం

-గుమ్మడిదలలో అట్టహాసంగా సంబరాలు

బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న బిజెపి శ్రేణులు

గుమ్మడిదల, మే 5, ప్రభాతవార్త:
ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి విజయంసాధించిన సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీలో ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. మున్సిపాలిటీ అధ్యక్షులు, కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి సమక్షంలో కార్యకర్తలు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపుమేరకు ఈకార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈసందర్భంగా కౌసర్, విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, యాదగిరి, అంజిరెడ్డి, ఐలేష్, కనకరాజు, విజయ్, వెంకట్, అనిల్‌రెడ్డి, వేణుపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రామ్‌రెడ్డి, పోర్చుగారి రవీందర్‌రెడ్డి, వీరారెడ్డి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, గూడెం రాజు, వెంకట్‌రెడ్డి, శివరాత్రి రాజు, సాయి, సిహెచ్.కృష్ణ, కిషోర్, భారీసంఖ్యలో బిజెపి కార్యకర్తలు హాజరై పార్టీ విజయాన్ని సంబరంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

సదాశివపేటలో బిజెపి విజయోత్సవ సంబరాలు

సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

సదాశివపేట, మే 5, ప్రభాతవార్త:
బిజెపి బెంగాల్, పాండిచ్చేరి, అస్సాం రాష్ట్రాలలో ఘనవిజయం సాధించిన సందర్భంగా సదాశివపేట మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు కర్ణం ఆదిత్య ఆధ్వర్యంలో మద్దికుంట చౌరస్తాలో కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పరస్పరం అభినందించుకొని, పటాకులుకాల్చి, మిఠాయిలుపంచుకున్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి వస్తున్న ఆదరణకు ఈవిజయాలు నిదర్శనమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉక్కిస భరత్‌యాదవ్, మండల సీనియర్ నాయకులు సారా కృష్ణ, జగన్నాథ్‌రెడ్డి, కల్పగూరి నాగరాజు, లక్ష్మణ్, కాశినాథ్, ప్రశాంత్, శ్రీకాంత్, దుర్గారాజ్, అనిల్, మల్లేశం, బక్కన్న, ప్రసాద్, శివప్రసాద్, విట్టల్, కుమార్, గోపాల్‌రెడ్డి, నవీన్, సంగమేశ్వర్, సతీష్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిములు, సుధాకర్, సాకేత్, బన్నీ, పవన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కొండంత అండ

-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట, మే 5, ప్రభాతవార్త:
పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్‌ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ అన్నారు. రామాయంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన 96మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీచేసి, నూతన వధువులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ ఆడపిల్లలపెళ్లి పేదకుటుంబాలకు భారం కాకూడదన్నదే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, దరఖాస్తు చేసుకున్న వారందరికీ విడతల వారీగా చెక్కులు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య, తహసీల్దార్ రజనీకుమారి, స్థానికకౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రోహిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అందోలు-జోగిపేట అభివృద్ధికి రూ.15కోట్లు

జోగిపేట, మే 5, ప్రభాతవార్త:
అందోలు-జోగిపేటలో అభివృద్ధికి రూ.15కోట్లరూపాయల నిధులు మంజూరైనట్లు అందోలు-జోగిపేట మున్సిపల్ ఛైర్మన్ ఎస్.క్రిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపడితే బాగుంటుందనే విషయాలపై ఈ పాటికే పలుసార్లు కౌన్సిల్‌సభ్యులతో చర్చించిన మంత్రి దామోదర్ అందులో ప్రస్తుతం ప్రధానంగా ఉన్న వాటికి నిధులను మంజూరు చేయించారు. ఇందులో జోగిపేటలో బహదూర్‌ఖాన్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలుకు రూ.3కోట్లు, మహిళాశక్తి భవననిర్మాణానికి కోటిన్నర, మదీన కమ్యూనిటీ హాల్ మరమ్మతుకు రూ.49లక్షలు, బాబానగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి, మరమ్మతులకు రూ.49లక్షలు, వివేకానందర్ పార్కు బ్యూటిఫికేషన్‌కోసం రూ.2కోట్లు, జోగిపేటలోని గౌని చౌరస్తా నుంచి ఫైర్‌స్టేషన్ వరకు యుజిడి పైపులైను ఏర్పాటుకు 2కోట్లు, అందోలులోని కుమ్మరిగూడెం డబుల్ బెడ్రూంల నుంచి సాయిబాన్‌పేట రోడ్డువరకు యుజిడిపైపులైనుకు 1.52కోట్లు, అందోలు-జోగిపేటమున్సిపాలిటీకి వెల్కమ్ ఆర్చ్‌లకోసం 2కోట్లు, పోసానిపేట పిడబ్ల్యుడి రోడ్డునుంచి ఆర్ఆర్ డిస్టిలేషన్ కంపెనీవరకు సిసిరోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లుతో కలిపి మొత్తం రూ.15కోట్లు మంజూరైనట్లు ఛైర్మన్ తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ మహేష్

మొగుడంపల్లి, మే 5, ప్రభాతవార్త:
ఉపాధిహామీపథకంలో కూలీలసంఖ్యను పెంచేవిధంగా చూడాలని ఎంపిడిఓ మహేష్ కోరారు. మంగళవారం మండలకేంద్రమైన మొగుడంపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధికూలీల సంఖ్య పెరిగేవిధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చలపతిరావు, ఎంపిఓ సంజయ్‌కుమార్, ఎపిఓ గణేష్, ఆయాగ్రామాల సర్పంచులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపుల జోరు-జనం బేజారు

-చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్న దృశ్యం

మొగుడంపల్లి, మే 5, ప్రభాతవార్త:
మండలంలోని ఆయా గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా ఏరులై పారుతున్నా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. అడపాదడపా తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు తప్పితే, అక్రమంగా మద్యం విక్రయాలను మాత్రం అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని ప్రత్యేకంగా చెప్పాల్సినపనిలేదు. తెల్లవారుఝాము నుంచే మద్యంప్రియులు గ్రామాల్లో బహిరంగంగా దొరుకుతున్న మద్యాన్ని సేవిస్తూ రోడ్లపై పిచ్చిగాచిందులువేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. మద్యంసేవించి ఇళ్లలో కుటుంబ సభ్యులతో నిత్యం గొడవలు కొనసాగిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు అక్రమంగా కొనసాగుతున్నా, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని, సంబంధిత అధికారులుస్పందించి గ్రామాలు ప్రశాంతంగా ఉండేందుకు అక్రమ మద్యంవిక్రయాలను అడ్డుకోవాలని మండలప్రజలు డిమాండ్‌చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

సమావేశంలో పాల్గొన్న రైతులు

గుమ్మడిదల, మే 5, ప్రభాతవార్త:
ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానాలు, లాభదాయకత, నిర్వహణపై వివరించారు. అలాగే కూరగాయలసాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ సబ్సిడీల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ఆయిల్‌పామ్ ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ఆత్మకమిటీచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్‌చైర్మన్ కుమార్‌గౌడ్, పాక్స్‌చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, రైతుసంఘం అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, తెల్లాపూర్ పాక్స్‌చైర్మన్ బుచ్చిరెడ్డి, సర్పంచులు మహిపాల్‌రెడ్డి, కొరివి రాణిసురేష్, లావణ్య తదితరులు హాజరయ్యారు. ఉద్యానశాఖ అధికారిణి అనూషరెడ్డి, హెచ్‌ఈవో అశోక్, గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధి భరత్, అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, ఎఈఓలు నికితా, అస్మిత, యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.నిర్మల, పటాన్‌చెరు డివిజన్ ఎడి మనోహర, అమీన్పూర్ ఆర్‌సిపురం ఎఓ ప్రసాద్, పటాన్‌చెరు ఎఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

-టిజిఐఐసి ఛైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

కొండాపూర్, మే 5, ప్రభాతవార్త:
ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు మద్దతుధర పొందాలని టిజిఐఐసి ఛైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం కొండాపూర్‌తోపాటు తొగర్పల్లి, తేర్పోల్, గొల్లపల్లి, మల్కాపూర్ గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని చివరిగింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గ్రేడ్-ఎ రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2,389, సాధారణరకం ధాన్యాన్ని రూ.2.369కు ప్రభుత్వం కొనుగోలుచేస్తుందని చెప్పారు. అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించడంపై వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ ఛైర్మన్ వై.ప్రభు, సిడిసి ఛైర్మన్ గడీల రాంరెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ నరసింహారావు దేశ్పాండే, సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం-ముఖ్యఅతిథిగా చైర్మన్ నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి...

సదాశివపేట, మే 5, ప్రభాతవార్త:
సదాశివపేట మండల పరిధిలోని మిలిగిరిపేట గ్రామంలో సోమవారం పండుగవాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన బూర్గుల లావణ్య-గోపాల్‌రెడ్డి దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిజిఐఐసి ఛైర్మన్ నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి నూతనగృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నూతనగృహంలోకి ప్రవేశించిన లావణ్య-గోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు నిర్మలాజయప్రకాశ్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిడిసి ఛైర్మన్ గడీల రామ్‌రెడ్డి, సదాశివపేట బ్లాక్ ప్రెసిడెంట్ చాట్ల సిద్ధన్న, మండలాధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ షాబుద్దీన్, చందాపూర్ సర్పంచ్ మల్లేశం, ఆరూర్ సర్పంచ్ నాయికోటి లావణ్యమధు, కంబాలపల్లి సర్పంచ్ ఇందూరి బాబు, మిలిగిరిపేట ఉపసర్పంచ్ యాదయ్య, వార్డుసభ్యులు పద్మమ్మ, మల్లారెడ్డి, సంగారెడ్డి శ్రీనివాస్, రాములమ్మ, సబీరా, లక్ష్మి, పంచాయతీసెక్రటరీ రాములు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు భద్రారెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, దానయ్య, సంగారెడ్డి ఉషయ్య, ఏశాబు, రియాజుద్దీన్, మహమ్మద్, గొల్ల మల్లేశం, గొల్ల మాణిక్యం, గొల్ల విటల్ కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు, జొన్నల కొనుగోలు

-మంత్రి దామోదర్ రాజనర్సింహా హామీ

వినతి పత్రం అందిస్తున్న రైతులు

సదాశివపేట, మే 5, ప్రభాతవార్త:
తెలంగాణ మంజీరా రైతుసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్ నేతృత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శనగలు, జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బయట మార్కెట్లో అమ్మడంవల్ల రైతులు నష్టపోతున్నారని, కనీస మద్దతుధర కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు వివరించారు. దీనిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ, తప్పకుండా ప్రభుత్వం ద్వారా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని రైతుసంఘాలకు హామీ ఇచ్చారు. రైతులు నష్టపోకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వీరన్న, సదానంద్‌రెడ్డి, మల్లికార్జున్‌శెట్టి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లిలో ఘనంగా జాతర బండ్ల ఊరేగింపు

బొడ్మట్‌పల్లిలో ఘనంగా జాతర బండ్లు ఊరేగిస్తున్న దృశ్యం

టేక్మాల్, మే 5, ప్రభాతవార్త:
టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జాతరబండ్లను ఘనంగా ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లోభాగంగా వీరభద్రాలయంలో ప్రత్యేకపూజలతో భక్తులు భక్తితో శివనామస్మరణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన, అభిషేకం ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో గ్రామస్థులంతా ఐకమత్యంతో కులానికి ఒక బండి చొప్పున అందంగా బండ్లను ముస్తాబు చేసి జాతరలో ఆటపాటలతో గుట్టచుట్టూ బండ్లను ఊరేగించారు. జాతరలో ఎలాంటి అసౌకర్యాలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీ ఛైర్మెన్ బస్వరాజ్, గ్రామ సర్పంచ్ అవినాష్‌లు శ్రద్ధచూశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది బందోబస్తును ఏర్పాటుచేశారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్రప్రభుత్వం

-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్, మే 5, ప్రభాతవార్త:
99 రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాయ గార్డెన్‌లో ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్, అధ్యక్షతన నిర్వహించిన ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరుగుదల, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాకలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ చైర్మన్ రాధికభూపతిరాజు, వైస్‌చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు రైతులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే, రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుసంక్షేమమే ధ్యేయంగా రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని అన్నారు. జిల్లాకలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా రైతువారోత్సవాల కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఒకే పంట కాకుండా పంటల మార్పిడి చేయాలన్నారు. అంతకుముందు శాఖ ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పది ఫెయిల్ అయిన విద్యార్థులకు నేటి నుండి ప్రత్యేక తరగతులు

పాపన్నపేట, మే 4, ప్రభాతవార్త:
ఇటీవల జరిగిన జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 6 నుండి పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటు రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తారన్నారు. ఇటీవల ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ హాజరయ్యేలా సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు చూడాలని ఎంఈఓ ప్రతాపరెడ్డి సూచించారు.

అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

-మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్టారెడ్డి

ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

జోగిపేట, మే 5, ప్రభాతవార్త:
మంగళవారం అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో నిర్వహించిన కోఆప్షన్ సభ్యుల ఎంపికప్రక్రియలో నలుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కోఆప్షన్ సభ్యుల ఎంపికలో పిట్ల భాగ్యలక్ష్మి, ప్రవీన్‌కుమార్, ఎం.డి.ముంతాజ్, ఎం.డి.జీషాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకోసం ముందుగా మున్సిపల్ కమిషనర్ పేర్లు, అభ్యర్థుల పేర్లు ప్రతిపాదించటంతోపాటు మౌఖికంగా ఆమోదిస్తున్నట్లు సభ్యులు తెలపాలని సూచించారు. ఈ మేరకు ఒక్కొక్కరి పేరు ఒక్కో కౌన్సిలర్ ప్రతిపాదించగా మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ ఎస్.క్రిష్టారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ ఎంపిక ఎలాంటి అడ్డంకులులేకుండా సాఫీగా సాగిపోయింది. ముందుగా అందరూ ఊహించిన అభ్యర్థులనే కోఆప్షన్ సభ్యులుగా ఎంపికచేశారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు అల్లె మంజుల, గూడెం కల్పన, నేనావత్ మేఘారాణి, రాచకొండ జ్యోతి, అరుణకుమారి, కొత్తగొల్ల మాధవి, ఉర్మిళ, తిరుమల కల్పన, కొశికె రాజశేఖర్, అరున్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఎఫ్ఎంసిఎస్ అధ్యక్షుడిగా సత్యంముదిరాజ్

సత్యనారాయణకు నియామకపత్రాన్ని అందిస్తున్న ఫిషరీస్‌అధికారులు

జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:
జహీరాబాద్‌లో ఫిషర్మెన్ మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎ.సత్యనారాయణ(సత్యంముదిరాజ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికలను ఫిషరీస్ ఇన్స్పెక్టర్ శివలింగవరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఎన్నికల్లో కార్యవర్గాన్నికూడా ఎంపికచేశారు. ఉపాధ్యక్షుడిగా టి.అంజయ్య, కార్యదర్శిగా సి.పరమేశ్వర్ ఎన్నికకాగా, డైరెక్టర్లుగా జె.జగన్, బి.ప్రశాంత్, టి.రాజు, ఎ.వెంకటేశం, జె.చంద్రశేఖర్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యంముదిరాజ్ మాట్లాడుతూ, మత్స్య కార్మికులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు, సదుపాయాలు అందేలా అధికారులతో చర్చించి కృషిచేస్తానని తెలిపారు.

సదాశివపేటలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

సదాశివపేట, మే 5, ప్రభాతవార్త:
సదాశివపేట మండల కేంద్రంలోని మార్కెట్ ఆవరణలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని, అలాగే నందికంది పిఎసిఎస్ పరిధిలో పెద్దాపూర్ రైతువేదికలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలుకేంద్రాన్ని టిజిఐఐసి ఛైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సిడిసి ఛైర్మన్ గడీల రాంరెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎలకొండ ప్రభు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అలివేల నరసింహారెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ కంది కృష్ణ, సదాశివపేటమండల బ్లాక్ అధ్యక్షుడు చాట్ల సిద్దన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ రేణుకచిరు, మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా సొసైటీచైర్మన్లు మనోహర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అధికారులు, తహసీల్దార్, ఎవో, మార్కెట్ సెక్రెటరీ, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండలసర్పంచులు మనీషా, బాలరాజ్‌గౌడ్, మల్లేశం, మోహన్‌గౌడ్, శివానంద్‌గౌడ్, సత్యనారాయణ, బింబాదర్ తదితర ప్రజాప్రతినిధులు, రైతులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

మోడీ సభను విజయవంతం చేయాలి

-బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథ్

మొగుడంపల్లి, మే 5, ప్రభాతవార్త:
ఈ నెల 10వ తారీఖున హైద్రాబాద్‌లోని పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బహిరంగసభకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతున్నారని, సభను విజయవంతం చేసేందుకు మండలం నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథ్ పిలుపునిచ్చారు.

చివరిగింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

-మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

గుమ్మడిదల, మే 5, ప్రభాతవార్త:
ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్మి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ కోరారు. గుమ్మడిదలమున్సిపల్ పరిధిలోని అన్నారం, గుమ్మడిదల గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితోకలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతిగింజను, చివరిగింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలుచేయాలని అన్నారు. కొనుగోలుకేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని, ముఖ్యంగా తూకం వేయడంలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టంచేశారు. ధాన్యం సేకరణ పూర్తి కాగానే రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా అధికారులు పూర్తిబాధ్యత తీసుకోవాలని, ఎండ తీవ్రత దృష్ట్యా కేంద్రాలకు వచ్చే రైతులకు కనీసవసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. రైతులకు ఎల్లవేళలా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, తహసీల్దార్ పరమేశం, కమిషనర్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎంపిడివో ఉమాదేవి వార్డు కౌన్సిలర్లు సోనీరెడ్డి, పద్మ, విజయలక్ష్మి, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, మురళి, చక్రపాణి, రమేష్, కుమార్‌గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, కోఆప్షన్ సభ్యులు నూర్జహాన్, భాస్కర్‌రెడ్డి, పిఎసిఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.